# ఆధిపత్యం

అతను ఆమె ఫోటోకి ఎదురుగా పడక విరిచి వెల్లకిలా పడుకొనివున్నాడు. అతనికి ఆ ఫోటోకి మధ్య ఒక దీపం వెలుగుతోంది. నిశ్శబ్దమైన ఆ రాత్రివేళ గోడమీదున్న గడియారం సమయం ఒక గంట అని మోగింది. అతను రెప్పవాల్చకుండా ఆ పటాన్నే చూస్తున్నాడు. అతని పెదవుల్లో ఒక చిరునవ్వు; దానితోబాటు ఆమెతో అన్యోన్యంగా పంచుకున్నట్టు - ప్రేమార్ద్రమైన, అపూర్వమైన కొన్ని మాటలు - సందడి చెయ్యకుండా - వాటితో కలిసి తేలుతున్నాయి.

ఇప్పుడు, రెండు వారాల తర్వాత, ఆమె అతనికి ఒక జ్ఞాపకంగానే నిలిచిపోయింది.

ఆమెను పోగొట్టుకొన్న బాధ భరించలేక కుమిలిపోతూ అతను కొంచెం సమయం ముందు నిద్రపోయాడు. అప్పుడు ఆమె వచ్చి ప్రేమతో అతని భుజం తాకి, చెవుల్లో ఉద్రిక్తమైన శ్వాసలు వదులుతూ, వొంగి, “ఇదేంటి? చంటిపిల్లలాగ నిద్రపోతున్నారు? కళ్ళు తెరిచి లేచి కూర్చోండి! . . . ఈ పాలు తాగండి!” అని లేపింది.

“హూం . . . హూం” అని గొణుక్కుంటూ అతను పడకమీద ఇలాగా అలాగా పాకుతుంటే ఆమె ముసిముసి నవ్వులతో, అతని తలకింద తన చెయిని పోనిచ్చి, దాన్ని ఎత్తి తన ఛాతీలో ఒత్తుకున్నప్పుడు ఆ చెయిలోని గాజుల సందడి అతని చెవులకి వినిపించింది; మల్లెపూల వాసన చెదిరిన నిద్రని పూర్తిగా గందరగోళం చేసేసింది.

“అబ్బబ్బా, చాలు . . . చాలు . . . నాకు చంటి పిల్ల లేని కొఱత మీవల్లనే తీరుతోంది! ఇక పాప వస్తే, అంతే, మీరిద్దరూ నా ప్రాణం తీసేస్తారు!” అని విసగ్గుంటూ, అతని నుదుట జారిన జుత్తుని పక్కకి తోసి, అతన్ని కూర్చోబెట్టి, పాల గ్లాసుని భర్త చెయికి అందించి, “ఇదిగో, గ్లాసు! పట్టుకోండి! నేను వెళ్ళి వంటగదిని శుభ్రం చెయ్యాలి!” అని ఆమె తొందరపెట్టింది.

అతని పెదవులని గ్లాసు తాకుతోంది; సగం నిద్రలో పాలు గొంతులో దిగగానే అతను ఒక గుక్కెడు మింగాడు.

“నువ్వు వెళ్ళి . . . అయ్యో . . . పట్టూ, నువ్వు పోయావే! . . . నువ్వు చావలేదూ? మళ్ళీ బతికి వచ్చేసావా?” అని వాపోయినప్పుడు అతని గొంతులో లేచిన ఇంపైన యోచన వెంటనే చేదుగా మారింది. “అదెలాగ? నిన్ను దహనం చేయలేదూ? నేనూ పక్కనుంచి చూసేనుగా?” అనే పాత జ్ఞాపకం గుర్తుకి వచ్చేసింది.

అప్పుడు గడియారం రెండు గంటలు మోగడంతో అతనికి పూర్తిగా మెలకువ వచ్చేసింది; అంటే, కళ్ళు తెరిచి చూసాడు. తను పడకమీద కూర్చున్నది గమనించి, గభీమని ఉలికిపడ్డాడు. దీపం వెలుగుతోంది; గడియారం మోగుతోంది; పడక ఎదుట అతన్ని చూసి ఆ ఫోటో నవ్వుతోంది. అవును! ఆమె నవ్వినప్పుడు తీసిన ఫోటో అది!

‘అదేంటి? ఆ పెదవులు మెల్లమెల్లగా కదులుతున్నాయే! చిరునవ్వు కనిపిస్తుందే?’

అతను లేచి నిటారుగా పడకమీద కూర్చున్నాడు.

ఆ గదిలో ఒక మూల ఎవరో పకపకమని నవ్వడం విని అతను తిరిగి చూసాడు.

అతని మొహమంతా తెల్లబాటిపోయింది; ఆ గడియారంలాగే తన గుండె కొట్టుకోవడం కూడా అతని చెవులకి వినిపిస్తోంది.

అతను మళ్ళీ ఆ ఫోటో చూసినప్పుడు ఆమె పెదవులు తెరచుకున్నాయి; కన్నులు విస్తరించుకున్నాయి; చూడడానికి ఇప్పుడు ఆ ఫోటో ఎంత భయంకరంగా ఉంది!

ఆ ఇంటి ఏకాంతంలో, ఈ అర్ధరాత్రిలో, తన నిద్ర చెడిన తరువాత ఎవరో తన్ను వేటాడతున్నట్టు భయపడి, లేచి, దేహాన్ని ముడుచుకొని, అతను అలాగే కూర్చొని ఉన్నాడు.

'పట్టూ, నువ్వు నవ్వితే నాకు ఎంత ముచ్చటగా ఉందో తెలుసా?' అని చాలా సార్లు అతను భార్యని పొగడేవాడు. కాని, ఇప్పుడామె లేదే! మరెందుకు ఈ ఫోటో నవ్వుతోంది?

అదిగో . . .

ఆ పక్కనే ఉన్న గదిలోనుంచి వచ్చే మల్లెపువ్వుల వాసన ఎంత మత్తుగా ఉంది!

గల్లు గల్లు అని కాలివేళ్లనున్న మెట్టెల సందడి;

గలగలలాడే గాజుల సవ్వడులు;

చటచటమని పట్టుచీర ధ్వని;

'ఇక్కడ కూర్చొని ఎన్నిసార్లు నేను నీ జుత్తులోని సుగంధం, నీ కాలి వేళ్ళ మెట్టెల సందడి, గాజుల సవ్వడి, చీరల మృదుత్వం అన్నీ అనుభవించి ఉన్నాను!

'పట్టూ, నువ్వు లేవు, నువ్విక కనిపించవు!' అని నా బుద్ధి నాకు చెప్తోంది. అయనప్పటికీ నా భావనలు నువ్వు ఇంత బలంగా ఏలుతున్నావే? ప్రతీ రాత్రి భయం, దిగిలు, గాబరా నన్ను పూర్తిగా ముంచిపేయడం చూస్తున్నాను. రాత్రి వస్తే చాలు, నరకం లాగ చిత్రవధ అనుభవిస్తున్నాను!'

ఆమె తన గదిలో ప్రవేశించి, బీరువాని తెరిచినట్టు, తాళంచెవి గొత్తుని దులుపుతున్నట్టు ధ్వని వినిపించగానే అతను తన చెవులని తీక్షణంగా సర్దుకొని చురుకుగా విన్నాడు.

అవును! ఆ ధ్వని బాగా వినబడుతోంది!

'ఇది అబద్ధం . . . అది పోయిందే! . . . నువ్వే ఒంటరిగా ఇప్పుడు ఈ ఇంటిలో ఉన్నావ్, మరెవరూ లేరు!" అని వివేకం అతనికి వక్కాణించి చెప్తోంది.

'అలాగైతే, ఆ ధ్వని రావడం ఎక్కడనుంచి? మెట్టెలూ, గాజులూ, తాళంచెవి గొత్తూ, ఇవన్నీ . . . మల్లెపువ్వుల వాసనకూడా గాలిలో తేలుతూ వస్తోందే?' అని వివేకం అతన్ని అడుగుతోంది.

ఆ వొంటిరిపాటు భరించలేక అతని దేహమూ, మనసూ చెల్లాచెదరైపోయాయి; ఇక పడకలో నిద్ర పోవడం అసాధ్యం.

స్పర్శ ద్వారా ఎన్ని రాత్రులు ఆ పడకమీద ఆమె ప్రేమని అతను అనుభవించి ఉన్నాడు!

గభీమని అతనికి మొహమంతా చెమట పట్టేసింది.

తటాలున ఆమె గది తలుపుని తెరిచాడు; ఒకటే చీకటిమయం!

ఆ తర్వాత వెలుతురు! ఆమె బీరువా కనిపించింది.

గదిలో అడ్డంగా వేసిన తాడులో ఆమె కట్టుకొని, విప్పివేసిన చీరలు, రవికలు, బట్టలు, వేలాడుతున్నాయి.

ఆ బీరువా తలుపులో ఆమె తన చెయితో ఆఖరిగా తెరిచి మూసిన తర్వాత ఆ తాళంచెవిగొత్తు అలాగే వేలాడుతోంది.

తాడులో వేలాడుతున్న బట్టలని - ఒకటి తరువాత ఒకటి - బాగా పరీక్షించి చూస్తే, అవన్నీ వేరేవేరే సమయాల్లో ధరించి ఆమె తన ముందు నిలబడిన దృశ్యాలు అతను ఇప్పుడు గుర్తుచేసుకున్నాడు.

'అది ఒక చిహ్నంగా, కలగా, నీడగా, భ్రమగా, మాయమైపోయింది, ఇక రాదు!' అని తన భార్యగురించి నిజమేమిటో తెలుసుకున్నా తన బ్రతుకు ఇక రామాయణంలోని కబంధుడులాగ తలా, మెడా లేని ఒంటరి వ్యక్తిలాగే  ఆనే భావన అతను మింగలేకున్నాడు.

తాడులో వేలాడుతున్న ఒక చీరని లాగ్గొని మొహంలో అదుముకున్నాడు; అతని భుజాలు వొంగినట్టనిపించింది.

అదిరిపడి, తన్నెవరో వెనెకనుంచి కౌగిలించుకొనే స్మరణ రాగానే, తడిసిన కన్నులతో అతను రెండు పక్కలా తిరిగిచూసాడు. ఒక క్షణం ఆగి, ఏదో ఆలోచనలో పడి, చెయిలోని చీరని మళ్ళీ మొహంకి అణచుకున్నాడు.

'అది లేదు. కాని దాని జ్ఞాపకం నన్ను ఏలుతున్నట్టు ఈ చీరల్లో దాని వాసన ఇంకా అలాగే ఉంది!'

అవును, ఆమెకని ఒక వాసన ఉంది! అది తనకి మాత్రం తెలుసు!

గడియారం మూడుగంటలు కొట్టింది.

అతనికి తనగురించి భయం బాగా కప్పుకుంది. రోజువారిగా ఈ రెండు వారాలూ రాత్రిలో నిద్రలేక ఆమె జ్ఞాపకంలో పిచ్చివాడుగా పరితపించే తన గతి తలచుకుంటే తనపై తనకే జాలి కలిగి, అతను హోరుమని ఏడవసాగాడు.

ఇప్పుడు అతనిక వెనుక - ముందులాగే - ఆ పడకలో ఆమె దొర్లుతునట్టు పకపకమని ఒక నవ్వు!

ఆ ఇంటినిండా ఆమె జ్ఞాపకం వ్యాపించి, తన్ను పూర్తిగా  లోపజుచుకున్న భావనతో అతను తికమకలాడాడు:

'నా ప్రాణం,  ఊపిరి అంతా నువ్వే! నా ఊహ అంతా నువ్వే!  నువ్వే! నువ్వే! నువ్వే!'

అతను అక్కడనుంచి మెల్లగా జారుకొని, మూసివున్న కిటికీ తలుపులు తెరిచాడు. దూరంలో, ఆకాశంలో, తారలతోబాటు ఒంటరిగా కృశించిపోయి అంగలార్చుకున్నట్టు ఆ చంద్రుడూ కనిపించాడు. చల్లని గాలి వచ్చి అతని మొహంలోని వేడి చెమటని చిన్ని చుక్కలుగా చేసింది. చాలాసేపు అక్కడే నిలబడి ఆ ఆకాశంని అతను తేఱి చూసాడు.

ఇంటిలో మల్లెపువ్వుల వాసన; గాజుల సవ్వడి; మెట్టెల ధ్వని; పట్టుచీర చేసే చట చట చప్పుడు;  పకపక నవ్వులు - ఇవన్నీ కలిసి చేసే గందరగోళం!

కదలడానికి కూడా అతనికి భయం; వెనక్కి తిరిగి చూడాలంటే అసలు దేహంకి, మనసుకి ధైర్యమూ లేదు.

తెల్లవారుజామున  వీధిలో పాలవాళ్లు ఆవులని నడిపించుకొని వెళ్ళినప్పుడు దూరంలో కోడి కూత విన్నతరువాతే అతని మోహంని భయంతో కప్పుకున్న చెమట శమించింది. అతను మెల్లగా తడబడుతూ మళ్ళీ నిద్రపోవాలని మంచంమీద వాలాడు; కిటికీ ద్వారా వచ్చే సూర్యకిరణాలు తన మొహంపై పడినంతవరకూ గాఢంగా నిద్రపోయాడు.

పగలు రాగానే అతనికి ఏకాంతమనే చెరసాలనుంచి విముక్తి కలిగింది. మామూలుగా దైనిక వ్యవహారాల సందడిలో అతని సమయం గడిపాడు.

కాని 'మళ్ళీ ఇవాళ రాత్రి వస్తుంది!' అనే హడలు మాత్రం పోసేలేదు.

‘అయ్యయ్యో, ఇక నా జీవితమంతా ఇలాగే సాగాలా? రాత్రి వస్తే నేను నరక వేదన అనుభవించి తీరాలా? ‘రాత్రంటే నాకు ఒకటే హడలు!’ అని పగటి వేళ అడగడానికే  నాకు సిగ్గుగా ఉందే! నా భయంగురించి ఎవరితోనైనా రెండు మాటలు పంచుకుందామంటే ఎవరూ లేరే? ఇంకా ఎన్ని రోజులు ఇలాగే అంగలార్చుకోడం?నా భార్య నాపై ఇంత భయంకరమైన అధికారం చెలాయించిన తరువాత, తనకిష్టం వచ్చినట్టు నన్నుకూడా తనవెంట తీసుకొనిపోయుంటే . . . ? అలాగైతే, ఆ చావులో నాకు కొరవలేనిదిగా ఎంత శాంతి!’ అని అతను వాపోయాడు.

** ** **

కొన్నిరోజుల తరువాత, ఒక రాత్రి, అతను తన పడకమీద కూర్చొనివున్నాడు.

పడక ఎదుట ఆమె ఫోటో ఉంది; మధ్య దీపం వెలుగుతోంది; అతను ఆ ఫోటో చూస్తూ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

ఇప్పుడు ఆ ఫోటోలో వికసించే చిరునవ్వు ఒక భ్రమలాగ లేదు. దాన్ని చూస్తూంటే ఆ చిరునవ్వే వికసిల్లుతున్నట్టు అవగాహన, వివేకం అతని మనసులో చోటు చేసుకున్నాయి.

ఇంటిలోపలనుంచి మెట్టెల సందడి వినిపిస్తోంది; గాజులు గలగలలాడుతున్నాయి; మల్లెపూల వాసన గాలిలో తేలి వస్తోంది.

కాని అతనికి రవంతైనా భయం లేదు.

ఎందుకంటే, ఇవన్నీ ఉత్తి జ్ఞాపకాలు కావు! అన్నీ నిజం!

‘ఏంటీ? నిజంగానా? ఆమె కన్ను మూసి ఒక నెలకూడా అవలేదే? అంతలోనే ఇంకొక పెళ్ళాం వచ్చేసిందా? ఛీ ఛీ, ఇతనేం మనిషి!’

ఊరులో అందరూ, బంధువులూ అదే ప్రశ్నే అడుగుతున్నారు; తనూ విన్నాడు.

‘పట్టూ! ఈ లోకం ఏమంటుందో మనం లెక్క చెయ్యనక్కరలేదు! ఇది నా ప్రశ్న - నాకు సంబంధించిన నీ ప్రశ్న - మన అవగాహన ఒప్పందంకి ప్రశ్న! ఈ సమాజంకి ఇదొక ప్రశ్న కాదు! వీళ్ల మాటలు వింటే నాకు ఒకటే నవ్వు! నాకు నువ్వంటే ప్రేమ లేనేలేదని అంటున్నారు; నువ్వు ఎప్పుడు చస్తావని

కాచుకొనివుండి  నువ్వు కన్నుమూసిన తర్వాత ఒక నెలముందే నేను ఇంకొక పెళ్ళి చేసుకున్నానట . . . పట్టూ, నా మనసులో దయ, కనికరం - ఇవేమీ లేవు అని వీళ్ళు మాటి మాటికి అంటున్నారు!

పట్టూ, విను! వాళ్ళు అన్నట్టు నేను నిన్ను ప్రేమించలేదంటే - నాలో దయ, కనికరం లేదంటే - ఈ పెళ్ళి జరిగేవుండదు!

నా హృదయంలో, భావనలలో, నీ ప్రభావం ఎంత లోతుగా పాతుకొని పోయిందనే సంగతి నాకు ఆ సింహాసనం శూన్యమైనతరువాతే బోధపడింది . . . విను! ఈ లోకంలో పాలకులు, అధీనులు అని రెండు వర్గాలున్నాయి. ఒక వర్గం అధీనులాగే మెలగితారాలి. వాటిమీద అధికారం చెలాయించకపోతే అవి నిరర్థకమైపోతాయి . . . అలాగే నేను పది సంవత్సరాలుగా నీ ఆధిపత్యంకి లొంగి, అందులో సుఖం అనుభవించి దానికి అలవాటు పడిపోయాను. ఇప్పుడు నువ్వు నన్ను గభీమని అనాథగా వదిలేస్తే నేనొక సన్యాసిగా మారాలని వీళ్ళందరూ అంటున్నారు . . .

ఎవరు ఏలుతున్నారో అతనికే తన అధికారం త్యజించి, సన్యాసిగా మారడం సాధ్యం. అతనికి లోబడిన వ్యక్తికి ఆ శక్తి లేదే? . . .

పట్టూ! తల్లి ప్రేమ ఎలాగుంటుందని నాకు అనుభవం లేదు. ఒక వేళ అనుభవించి ఉంటే నా బాల్యంలో ఒక సవతితల్లి కావాలని ఆశించివుంటాను  . . .

'భార్య' అనే పదాన్ని ప్రపంచంలో చాలామంది మోటుగా భావిస్తున్నారు. నేనూ ముందు అలాగే అనుకున్నాను. సృష్టిధర్మం అనుసరించి ఆడ మగల మధ్య ఏర్పడే ఆకర్షణ యవ్వనంలో మధురానిభూతిగా ఉంటుంది. కాని ఆ బంధం శారీరక పరిమితిని అతిశయించి సాగలేదంటే అది ఉత్తి వ్యభిచారమే అనాలి. వేదాంతులు ఈ శరీరం  ఆత్మకి ఇల్లు అని అంటారు. ప్రపంచంలో చాలామంది వివాహేతర లైంగిక సంబంధాలలో తృప్తి పొందుతున్నారు. అసలు వాళ్ళకి ఆత్మీయత, ఒద్దిక అంటే ఏమీ తెలియదు. ఆ ధోరణి వివాహ వ్యవస్థ పవిత్రతని దెబ్బ తీస్తుందని, అది సమాజంపై దుష్ప్రభావం చాటుతుందని వాళ్ళకి తెలీదు . . .

నా తల్లి నాకివ్వలేని ప్రేమానురాగాలు నీ వలన నాకు దొరికాయి . . . నా తల్లి ఇవ్వలేనిది ఒకటికూడా నువ్వే ఇచ్చావ్ . . . ఆ సుఖాలన్నీ ఉత్తి కలలు, మైకం, మాయలు అనవచ్చా? వాటిని మోసం, వంచన అని తోసిపారేయడం సాధ్యమా?

పట్టూ, అవన్నీ వాస్తవిక భావనలు కావా? అవి నిజమైన స్పర్శానుభవాలు! అందువలనే నువ్వు నా 'వివేకం'కి చెందకపోయినా, నీ ముట్టడి ఇప్పుడు నన్ను వెయ్యింతల ప్రభావంతో చిత్రవధ చేస్తోంది . . .

తల్లి ఆదరవు, రక్షణ అనుభవించిన పిల్లవాడు తనకి సవతితల్లి కావాలని ఆశించితే అది పాపం అని అనవచ్చా?

తన్ను పోగొట్టుకొని బాధపడుతున్న ఆ పిల్లవాడిని తల్లిలాగ చనువుతో ఒక స్త్రీ కౌగిలించుకుంటే ఆ తల్లి ఈ సవతి తల్లిని దీవించదూ?

పట్టూ, మనకి కథల్లో, సినిమాల్లో చెప్తున్నట్టు 'నేను పోతే నువ్వు ఇంకొక పెళ్ళి చేసుకో,' అనో లేక 'నేను పోతే, నువ్వు మరెవ్వరినీ ప్రేమించను అని నాకు మాట ఇవ్వాలి,' అనో మనం పరస్పర ఒడంబడిక చేసుకోలేదు; అటువంటి పిచ్చిపనులు మనం చెయ్యలేదు! అంతేకాదు. నువ్వు కన్నుమూసినతరువాత నేను నీతో నిద్రపోయిన ఇదే పడకలో, ఒంటరిగా, నెమ్మదిగా, నిద్రపోగలిగానంటే నీతో గడచిన రాత్రులన్నీ నిరర్థకరాత్రులైపోతాయి! నీతో నేను అనుభవించిన, నువ్వు నాకిచ్చిన సుఖాలని నేను త్యజించగలిగానంటే అవన్నీ అల్పమైన, అప్రధాన సుఖాలైపోతాయి! నీ ఆధిపత్యంకి మరేం ఘనత ఉంటుంది, చెప్పు! కాని నీతో నేను గడిపిన రాత్రులన్నీ స్వర్గంలో గడిపిన క్షణాలని, ఆ అంతరంగిక సుఖాల మహత్వంని నువ్వు లేనప్పుడే, నిన్ను పోగొట్టుకున్న తర్వాతే, నేను పూర్తిగా గ్రహించాను. నువ్వు లేకుండానే నీగురించి పాత జ్ఞాపకాల్లో నేను మునిగిపోయానంటే నీ ఆధిపత్యంకి ఎంత శక్తి ఉందని తెలుసుకో!

నాకు సుఖమూ, సంతోషమూ ఇచ్చిన నీ పాత జ్ఞాపకాలవలన నా మనసు కూలిపోయింది; భయం పూర్తిగా కప్పేసింది; పిచ్చివాడులాగ చాలా రాత్రులు నిద్రలేక చిఱచిఱలాడాను. ఇలాగేనా నీకు నేను నా కృతజ్ఞత చూపాలి?

ఎవరిని గుర్తుచేసుకొని నేను ఆహ్లాదించేవాడినో ఆమెవలన  నాకిప్పుడు మానసిక క్షోభ వచ్చేసిందంటే అది ఎంత ఘోరం! ఎవరి రాక, ప్రసన్నత, చిరునవ్వు, వాసన నాకు స్వర్గమో అవన్నీ తారుమారై, దారుణ చిహ్నాలుగా కనిపిస్తున్నాయంటే నేను నా ఆత్మకి ద్రోహం చేస్తున్నాను అంటున్నాను. పట్టూ, అది నిజం కాదా?

కాని దీనితో నువ్వు ఏకీభవించవు అని నాకు తెలుసు . . .

ఒక పరస్పర ఒడంబడికని అనుసరించి మనిద్దరి కాపురం సాగుతోందనే  ప్రజ్ఞ లేకుండానే, మనం రోజులు గడిపేసాం . . . ఇప్పుడు నీ ప్రశ్న నీకు తీరిపోయింది, కాని నువ్వు నాకొక ప్రశ్నగా మారావ్! అంతేకాదు, నేనే నాకొక ప్రశ్నగా ఐపోయాను!  . . .

నువ్వు నాపై చూపిన ప్రేమానురాగాలు, సుఖాలు భవిష్యత్తులో అనుభవించాలని, నీ ఆధిత్యంనుంచి నాకు దొరికిన స్వేచ్ఛ నాకు ఇష్టంలేని విముక్తి అని తెలుసుకొని నీ ఆధిత్యంకి వశమవాలని నేను తొందరపడుతున్నాను . . .

పట్టూ, నేను దీన్ని పెళ్ళాడాను, ఎందుకు? నిన్ను నేను ప్రేమించాను, అందుకే! అవును! నువ్వు నా మీద చెలాయించిన అధికారం నన్ను నిర్బంధించింది, బలవంతంచేసింది. నేను సరేనన్నాను. గభీమని, అన్నీ త్యజించి, సన్యాసిగా, దౌర్భాగ్యమైన బ్రతుకు నువ్వు నాకివ్వలేదు . . . పట్టూ, నాలోనూ దయా, కనికరం ఉన్నాయి . . .

ఈమె నీ ప్రతినిధి! ఇక నీకు బదులు నన్ను ఎలుతున్న అధికారి!

లోకం గురించి ఇక ఏ ఆలోచనా వద్దు! ఇది రెండు అర్ధాయువులు ఏకత్వంకి పూనుకున్న ప్రశ్న! సమాజంలో మరెవరికీ దీనితో సంబంధం లేదు!'

అప్పుడే మల్లెపూలల వాసన, పట్టుచీర తాకు, మెట్టెల సద్దు, అతన్ని చుట్టుముట్టుకున్నాయి.

అతను కళ్ళు మూసుకొని, కదలక, అలాగే కూర్చున్నాడు.

పకపకమని నవ్వు వినిపించింది. "ఇదేంటి, మీరు చంటిపాపలాగ కూర్చొనే నిద్రపోతున్నారు?" అని మెల్లగా అడుగుతూ, అతని భుజాన్ని తాకి, చెవుల్లో

ఉద్రిక్తమైన శ్వాసలు వదులుతూ, “సరే, ముందు పాలు తాగండి!” అని ఆమె వేడుకుంది.

అతను మౌనంగా కూర్చున్నాడని గమనించి ఒక చిరునవ్వుతో తన చెయిలోని గ్లాసుని అతని పెదిమలకి నొక్కి, అతని తలకింద తన చెయిని పోనిచ్చి, ఎత్తి, పాలు తాగమంది.

పాలు తన పెదిమలని తాకి, నాలికనుంచి గొంతులో దిగుతున్నప్పుడు అతను కళ్ళుతెరిచి ఎదుటనున్న ఫోటో చూసాడు. ఒక తల్లి జాలితో, చిరునవ్వుతో  తన్ను చూస్తోందనే బావనతో అతనికి భయం పోయింది.

అవును, తోడుంటే భయమెందుకు?

********